క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల ట్రిప్పులు పెంచాలని డీఎంకు వినతి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సుల ట్రిప్పుల సంఖ్యను పెంచాలని గ్రామస్తులు శనివారం కోరుట్ల డీఎం మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కోరుట్ల– గంభీర్‌పూర్ రూట్‌లో ఒక్కటే బస్సు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ, సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నామన్నారు. ఉదయం వేళ బస్సులు లేకపోవడంతో విద్యార్థులకు, వ్యాపారులకు ఇబ్బందిగా ఉందన్నారు. అదనంగా ఉదయం రెండు ట్రిప్పులు, సాయంత్రం రెండు ట్రిప్పుల బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి జలందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో సీడ్ బాల్స్ వేసిన విద్యార్థులు



సీడ్ బాల్స్ వేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం అడవిబాట పట్టారు. అడవుల్లో విద్యార్థులు సీడ్ బాల్స్ వేశారు. కానుగ, వేప, చింత, నేరెడు, కుంకుడు విత్తనాలు సేకరించి సీడ్ బాల్స్ తయారు చేయించి కొండ ప్రాంతంలో అటవీశాఖ అధికారుల సమక్షంలో విద్యార్థులు వెదజల్లారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో పద్మాకర్‌రావు, సెక్షన్ ఆఫీసర్ చైతన్య, బీట్ ఆఫీసర్ మధుసుదన్, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు వ్యాధి నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యురాలు మనీషా

మెట్‌పల్లిరూరల్: పాడి రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లులలో శనివారం గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను వేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షకాలంలో నీలినాలుక వ్యాధి ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందన్నారు.వ్యాధి నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు గొర్రెలకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణయ్య, ఆఫీస్ సబార్డినేట్ దిలీప్, పాడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని విజడమ్ హైస్కూల్‌కు చెందిన చిదుమల సాన్విక అండర్ –12 గర్ల్స్ లాంగ్‌జంప్ విభాగంలో, గణపతి కల్యాణకృష్ణ బాయ్స్ లాంగ్‌జంప్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రవీశ్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వీరిని విజడమ్ హైస్కూల్ కరస్పాండెంట్ ముత్యపు రాజిరెడ్డి, డైరెక్టర్ నివేదితరెడ్డి అభినందించారు.

ఢిల్లీ తరలిన న్యాయవాదులు

జగిత్యాలజోన్: ఢిల్లీలో శనివారం జరిగిన కాంగ్రెస్ లీగల్ సెల్ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాదులు ఎస్‌పీ.సుబ్రహ్మణ్యం, ఎండి సలీం పాల్గొన్నారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడిపై కాంగ్రెస్ లీగల్ సెల్ సమావేశం నిర్వహించింది.కార్యక్రమంలో సెంట్రల్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ అభిషేక్ సింగ్వి, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక్ గాంధీ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

జగిత్యాల:ఖాజీపుర హైస్కూల్ హెచ్‌ఎం రహీం ఉద్యోగ విరమణ చేయగా.. డీఈవో రాము సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, సైఫోద్దీన్, యూసూఫ్ అలీ పాల్గొన్నారు.



స్నేహితుడిని కోల్పోయిన..



అనారోగ్యానికి గురై చిన్ననాటి మిత్రులను ఇద్దరిని కోల్పోయి బాధపడ్డాం. స్నేహితుడి పిల్లలు మంచి ప్రయోజకులుగా మారాలని అందరం అనుకున్నాం. దుంపేటలో ప్రసాద్ అనే స్నేహితుడి కోల్పోవడంతో ఆ కుటుంబానికి క్లాస్‌మెంట్స్ అందరం రూ. 50 వేలు ఆర్థికసాయం అందించాం. దూలూర్‌లో సత్యనారాయణ అనే స్నేహితుడిని కోల్పోయాం. అతని కూతురు, కుమారుడు డిగ్రీ పూర్తయ్యేవరకు నేను సొంతంగా ఆర్థికంగా సహకారం అందిస్తున్నాను.

– ఆకుల రాజేశ్, దుంపేట(కథలాపూర్)

స్నేహాలకు ఇప్పుడు అర్థాలు మారాయి



ప్రస్తుత కాలంలో స్నేహాలకు అర్థాలు మారాయి. ఆపదలో అండగా నిలిచే స్నేహాలు కరువయ్యాయి. గతంలో స్నేహం కోసం స్నేహం చేసేవారు. ఇప్పు డు అవసరాల కోసం స్నేహం చేస్తున్నారు. సమయం వచ్చినప్పుడు నిజమైన స్నేహాలు బయటపడుతాయి.

– పల్లెర్ల అపర్ణ, గృహిణి, అశోక్‌నగర్, కరీంనగర్

అరమరికలు లేని స్నేహం మాది



కోరుట్ల రూరల్: మేం నలుగురం ప్రాణ స్నేహితులం. పడాల శశిదర్ నేనూ ఇద్దరం ఓనమాల నుంచి కలిసే చదువుకున్నాం. తుమ్మనపెల్లి దివాకర్, ఠాకూర్ చరణ్ సింగ్ ఇంటర్‌లో స్నేహితులయ్యారు. అప్పటి నుంచీ నలుగురం మంచి స్నేహితులం. నలుగురం గత 25 ఏళ్లుగా కలిసే ఉంటున్నాం. కష్టాలు, సుఖాల్లో కూడా ఒకరికొకరం పాలు పంచుకుంటున్నాం. అరమరికలు లేని స్నేహితం మాది. కడ వరకూ కలిసే ఉంటాం.

– వనతడుపుల రమేష్ ,సంగెం, కోరుట్ల

కొండగట్టులో శ్రావణ మాస సందడి



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల: కొండగట్టులోని అంజనేయస్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కోనేటిలో స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. అంజనేయస్వామికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది. టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.3లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈఓ శ్రీకాంత్ రావు, సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అశోక్, ఏఎస్సై రమణారెడ్డి భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్: అర్హులైన నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం రాయికల్ మండలం ఇటిక్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. మంజూరు కాని వారు ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు గోపి రాజిరెడ్డి, గుర్రం మహేందర్, బాపురపు నర్సయ్య, ఆదిరెడ్డి, జలేందర్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో తనిఖీ



కార్యాలయంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: మున్సిపాలిటీలో ఇటీవల ఆస్తిపన్ను సొంతానికి వాడుకున్న ఓ ఉద్యోగి సస్పెండ్ కావడం .. పలు శాఖలపై ఆరోపణలు రావడంతో అదనపు కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ లత బల్దియాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైళ్లు పరిశీలించారు. అవినీతికి తావులేకుండా ఉండాలని ఆదేశించారు. ఆమె వెంట కమిషనర్ స్పందన ఉన్నారు.

'అమృత్' పనులను వేగవంతం చేయాలి

రాయికల్: పట్టణంలోని 9, 10 వార్డులో చేపడుతున్న అమృత్ పనులను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత సూచించారు. శనివారం రాయికల్‌లోని అమృత్ 2.0 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బల్దియాలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గాను అమృత్ 2.0 ఎంతో ఉపయోగపడుతుందని, అధికారులు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట కమిషనర్ మనోహర్‌గౌడ్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ వెంకటి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన పెంచుకోవాలి

జగిత్యాలఅగ్రికల్చర్:మహిళాసంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య సభ్యులతో సమావేశమయ్యారు. మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఐకేపీ కేంద్రాలను జిల్లాలో పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు.

యూసుఫ్‌నగర్‌లో ఒకరికి విద్యుత్ షాక్

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో మరిపెల్లి రాములు అనే ప్రైవేట్ మెకానిక్ శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ వేసేందుకు రాములు ట్రాన్స్‌ఫార్మర్ స్విచ్ఛాఫ్ చేశాడు. గద్దె ఎక్కి సరి చేసే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన రైతులు అతడిని మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఏడీఈ రఘుపతి పరిశీలించారు. రైతులకు జాగ్రత్తలు వివరించారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమైనవి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

జగిత్యాలరూరల్: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమైనవని, గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి గంటలోపు ముర్రుపాలు పట్టించడం బిడ్డకు మొదటి టీకాతో సమానమన్నారు. కార్యక్రమంలో సెక్రటరి సురేశ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శోభారాణి, ఏఎన్‌ఎం మమత, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అలవాల భారతి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శృతిలయ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. శిశువు పుట్టిన నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం మల్లిక, పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులు, గర్భిణులు, బాలింతలు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పెగడపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న అన్నారు. మండలంలోని ఆరవెల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, గంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి విరాళం

మల్యాల: మండలంలోని రామన్నపేట గ్రామానికి మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మల్లారెడ్డి రామాలయ నిర్మాణానికి రూ.1,11,111/- విరాళం అందజేశారు. రామన్నపేట హనుమాన్ ఆలయ పరిసరాల్లో నిర్మిస్తున్న రామాలయం, సత్యనారాయణ స్వామి ఆలయాల కోసం శనివారం ఆలయ అర్చకులు వకుళాభరణం నర్సయ్యకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రమేశ్, రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలో కాపు సంఘ భవన నిర్మాణానికి ఎంపీ అర్వింద్ కోటా నుంచి నిధులు మంజూరు చేయించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్నేని రఘుకు ఆదివారం సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొడ్ల రమేశ్, చింతల శ్రీకర్‌లతో పాటు పలువురు సంఘ నాయకులు ఉన్నారు.

గడి బురుజు భూములను స్వాధీనం చేసుకోవాలి

కోరుట్ల: పట్టణంలోని గడి బురుజు భూములను కబ్జాల నుంచి కాపాడి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో అఖిల పక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గడి బురుజు, ఆబాది స్థలం 3 ఎకరాల 21 గుంటల స్థలాన్ని ప్రజా ప్రమోజనాల కోసం వినిమోగించాలని, మున్సిపల్ పార్క్ , కూరగాయల మార్కెట్ కోసం వినియోగించాలని అప్పటి మున్సిపల్ కౌన్సిల్ కూడా తీర్మానించిందని పేర్కొన్నారు. తీర్మానం కాపీని అందరికీ పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెన్నా విశ్వనాథం, సుతారి రాములు, సీపీఎం నాయకుడు తిరుపతి నాయక్, సీపీఐఎంఎల్ నాయకుడు చింతా భూమేశ్వర్, కాంగ్రెస్ నాయకుడు వెగ్యారపు మురళి, బీఆర్‌ఎస్ నాయకుడు అన్వర్,తదితరులు పాల్గొన్నారు.

● హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్: పట్టణంలోని హనుమాన్ ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో విక్రమ్, అర్చకులు భరత్‌శర్మ, సత్యనారాయణశర్మ, సంతోష్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

● క్రికెట్‌లో సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి

కొడిమ్యాల: హైదరాబాద్‌లోని మొయినాబాద్ వన్ ఛాంపియన్ గేమ్ స్టేడియంలో నిర్వహించిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ టు డేస్ లీగ్ మ్యాచ్‌లో కొడిమ్యాల జూనియర్ కళాశాలకు చెందిన ఎర్రోజు తక్షిల్ సత్తా చాటాడు. మ్యాచ్‌లో 5 వికెట్లు తీసి,127 రన్స్ చేసి ఆల్ రౌండర్ ప్రతిభ చూపించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ కె.వేణు, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, అధ్యాపకులు,విద్యార్థులు అభినందించారు.

● సైబర్ నేరాలపై అవగాహన

రాయికల్: మండలంలోని రామాజీపేటలో ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డు నంబర్లు చెప్పవద్దని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ పవన్, రఘువీర్‌రెడ్డి, వీఎల్ఈ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● దివ్యాంగుల మహాగర్జన విజయవంతం చేయాలి

కోరుట్ల రూరల్: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 6న నిర్వహించే మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పెల్లి లక్ష్మణ్ మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని వృద్ధుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లంక దేవదాస్, వడ్నాల శ్రీనివాస్, బినవేణి లక్ష్మి, రేగుంట రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: జగిత్యాలలో ఈ నెల 6న జరిగే దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్‌మాదిగ అన్నారు. ఈ సభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ప్రజలు భారీగా తరలిరావాలనికోరారు.

● పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత

జగిత్యాల: పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎస్‌కేఎన్ఆర్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలియా మక్సూద్ అన్నారు. శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు ధరిచేరవన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కొట్బాల తిరుపతిరెడ్డి, అధ్యాపకులు తిరుపతి, శీలం సునీత పాల్గొన్నారు.

● ఉచిత వైద్య శిబిరం

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని డీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీబీ బ్యాంక్ మేనేజర్ ఈగ రాజేశం మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మెడికవర్ వైద్యుల చేత ఉచిత వైద్య పరీక్షలతో పాటు, సాధారణ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

● మల్లాపూర్ ఏపీఎంగా రమేశ్

మల్లాపూర్: మండల ఏపీఎంగా బైండ్ల రమేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రభుత్వ పథకాల అమలుతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎంకు సీసీలు లక్ష్మీరాజం, రాజు, రమేష్, స్రవంతి, సీవో నవీన్, అకౌంటెంట్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, కోశాధికారి అభినందనలు తెలిపారు.

ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు



వెల్గటూర్: మండలంలోని పాశిగామ ప్రాథమిక పాఠశాల, విజ్ఞాన్ కిడ్స్ పాఠశాలలో ముందస్తుగా ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు ధరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

మేడిపల్లి: రైతులు నానో యూరియా వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ సూచించారు. మండలంలోని రాజలింగంపేట్ గ్రామంలో నానో యూరియా వినియోగంపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈరోజుల్లో ఖరీదైన ఎరువులు అధిక ఉత్పత్తి ఖర్చులు రైతులను ఆర్థికంగా ఒత్తిడికి గురి చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఇఫ్కో తీసుకొచ్చిన నానో యురియా రైతులకు ఒక వరమన్నారు. నానో యూరియా అనేది గ్రాన్యూలర్ యూరియాకు ప్రత్యామ్నంగా అభివృద్ధి చేసిన ద్రవ రూపంలోని ఎరువన్నారు. ఇది సాధారణ యూరియా కంటే ఎక్కువ ప్రభావం చూపిస్తుందన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

కథలాపూర్: సీసీలు, వీవోఏలు సమన్వయంతో పనిచేసి మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సెర్ప్ ఏపీఎం చిన్న రాజయ్య కోరారు. శనివారం కథలాపూర్‌లో సెర్ప్ కార్యాలయంలో అన్ని గ్రామాల వీవోఏలతో పాటు అధికారులతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతోపాటు వందశాతం రికవరీకి ప్రోత్సహించాలన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం చిన్నరాజయ్యను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు అంజయ్య, విజయనిర్మల, అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

కథలాపూర్: కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలను అక్కడి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. కోరుట్ల బీఆర్‌ఎస్ నేతలను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, గంగారెడ్డి కలిసి మద్దతు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, అరెస్టులు చేయడం దారుణమని మండల నాయకులు మండిపడ్డారు. అరెస్టయినవారిలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, మాజీ సర్పంచ్ రాజేశం, పిడుగు సందయ్య తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు కాగా, శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, జాన గోపి, సత్తయ్య, గంగాధర్, హైమద్, అంజగౌడ్, నారాయణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో లలితా సహస్రనామ పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

జగిత్యాలటౌన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం అమెరికా దేశం బోస్టన్ నగరంలోని మసాచ్యుయేట్స్ ప్లాంటేషన్ స్ట్రీట్‌లోని ఓ అపార్టమెంట్‌లో తెలంగాణకు చెందిన పలు కుటుంబాలు సామూహిక లలితసహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన వేద్విని, పద్మలత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.